క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు, మగ్గం, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ జి.రాంబాబు మంగళవారం తెలిపారు. కుట్టు, మగ్గం కోర్సుల్లో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని చెప్పారు. కంప్యూటర్ కోర్సులకు మహిళలు, పురుషులు హాజరు కావచ్చన్నారు. ఏప్రిల్ 10 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. శిక్షణా సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సంస్థలో లేదా 98498 47489 నంబరులో సంప్రదించాలన్నారు.

రంగా సేవలు మరువలేనివి



బుర్రిలంకలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యచంద్రరావు తదితరులు

కడియం: దివంగత నేత వంగవీటి మోహనరంగా సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ పాటంశెట్టి సూర్యచంద్రరావు అన్నారు. బుర్రిలంక యువత ఆధ్వర్యంలో రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం బుర్రిలంకలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యచంద్రరావు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి, రంగా సేవలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, స్థానిక నాయకులు పాటంశెట్టి సుబ్బారావు, కొత్తపల్లి మూర్తి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు సత్కారం



సోము వీర్రాజును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అభినందన సభ మంగళవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, బీజేపీలో పైరవీలకు ఆస్కారం ఉండదని, కష్టపడి పనిచేయడం అలవర్చుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ, తాను మంత్రి కావాలనుకుంటే.. 2014లో సీటు ఇచ్చినప్పుడే అయ్యి ఉండేవాడినన్నారు. కార్యకర్తలకు కోరికలు ఉండడం సహజమని, అంతకన్నా కమిట్‌మెంట్ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, సుజనాచౌదరి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంజనా ఫౌండేషన్‌తో ఆర్ట్స్ కళాశాల ఎంవోయూ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కృష్ణా జిల్లా అవనిగడ్డ అంజనా ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మంగళవారం తెలిపారు. అంజనా ఫౌండేషన్ ద్వారా వివిధ సంస్థల ద్వారా విద్యార్థులకు శిక్షణ, సాంకేతిక మద్దతు, అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, ఉపాధి నైపుణ్యాలు, పని సంస్కృతి, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగం ఇన్‌చార్జి సీహెచ్ కోమల లక్ష్మి, అంజనా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.నవీన్, ఇంటర్న్‌షిప్ కో ఆర్డినేటర్ వై.రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కన్నమాంబ పేరంటాలమ్మ వారి 127వ జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక ఆల్కాట్‌తోట నరసింహారావుపేటలో మంగళవారం అమ్మవారి ఘటాలను పురవీధులలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఘటాలకు పూజలు నిర్వహించారు.

భారీ వాహనాలతో బెంబేలు

కోరుకొండ: మండలంలోని నర్సాపురం చెరువు మట్టిని రవాణా చేసేందుకు భారీ వాహనాలను వినియోగించడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారని కోరుకొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ మారిశెట్టి తేజోనాయుడు మంగళవారం ఇక్కడ తెలిపారు. రాత్రి వేళల్లో లారీలు ప్రయాణించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ భారీ వాహనాలను వేగంగా నడపడంతో స్థానిక అంబేడ్కర్ కాలనీ వాసులు రోడ్లపైకి రావడానికి భయపడుతున్నట్లు చెప్పారు. భారీ వాహనాలను నియంత్రించాలని అధికారులను కోరారు.

పప్పులేని విస్తరాకు

వేడి అన్నంలో పప్పు వేసుకుని.. కాసింత నెయ్యి కలిపి తింటే.. ఆహా ఆ రుచే వేరు. తరచూ ఆలకించే ఈ మాట ఇప్పుడు పేద వారి ఇంట కొన్ని నెలలుగా వినబడడం లేదు. కూటమి సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచీ.. కందిపప్పు అనేది పేదవారికి 'అందని ద్రాక్ష' లాగే మారింది. ప్రస్తుత పరిస్థితులు మున్ముందు కొనసాగితే.. పేదవర్గాల్లో కందిపప్పు అనే ఆలోచన కనుమరుగవుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.



ఎండీయూ వాహనం ద్వారా చేస్తున్న రేషన్ పంపిణీ

- ఏప్రిల్‌లో కందిపప్పు పంపిణీ తూచ్
- రూరల్ మండలంలో పది శాతమే..
- రాజమహేంద్రవరం సిటీ, కడియం మండలంలో కానరాని దుస్థితి
- బహిరంగ మార్కెట్‌లో రూ.170 వరకు విక్రయం

రాజమహేంద్రవరం రూరల్: అసలే నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కనీసం బియ్యంతో పాటు పౌర సరఫరాల శాఖ వారు పంపిణీ చేయాల్సిన కందిపప్పును కూడా కంటితుడుపు చర్యగా అందించటంతో గత ఫిబ్రవరిలో పేదింట కందిపప్పు ఉడక లేదు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో 1.53 లక్షల రేషన్‌కార్డులు ఉండగా, కేవలం రాజమహేంద్రవరం రూరల్ మండలంలో పది మంది రేషన్ లబ్ధిదారుల్లో ఒక్కరికి మాత్రమే కందిపప్పు పంపిణీ జరిగింది. కడియం మండలం, రాజమహేంద్రవరం సిటీ ప్రాంతంలో ఒక్క లబ్ధిదారుడికీ కందిపప్పు అందలేదు. రూరల్ మండలంలో మాత్రమే 10 శాతం మందికి కంది పప్పు పంపిణీ చేశారని, కందిపప్పును కేవలం కొంతమందికే పంపిణీ చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్కెట్‌లో కందిపప్పు ధర ఆకాశాన్నంటుతోంది. ఒక్కో ప్రాంతాన్ని బట్టి, నాణ్యతను బట్టి కిలో రూ.160 నుంచి రూ.170 వరకూ విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం ఎండీయూ వాహనాల్లో కందిపప్పును పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో కందిపప్పు రూ.67 చొప్పున రేషన్‌కార్డు లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. కానీ ముందుగా రేషన్ తీసుకున్న వారికి మాత్రమే కందిపప్పు అందుతుందని కార్డుదారులు చెబుతున్నారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పును ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఆర్భాటంగా హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక అరకొరగా పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. మూడు నెలలుగా కందిపప్పు పంపిణీ సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. కందిపప్పు కోసం మండలాల నుంచి ఇండెంట్ పెట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి రాకపోవడంతో.. బియ్యం, పంచదార పంపిణీతోనే రేషన్‌డీలర్లు, ఎండీయూ వాహనదారులు సరిపెడుతున్నారు. కందిపప్పు కోసం అడిగితే.. తరచూ వారి నుంచి లేదనే సమాధానం వస్తోంది.



కందిపప్పు

పేదలపై చిన్నచూపు



పేదలకు రేషన్ కార్డుదారులకు ఇచ్చే కందిపప్పును కూడా ప్రభుత్వం సరిగ్గా ఇవ్వకుండా చిన్నచూపు చూస్తోంది. రాజమహేంద్రవరం సిటీలో ఒక్కరికి కూడా కందిపప్పు అందలేదు. ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ కందిపప్పు ప్రతి నెలా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సబ్బెళ్ల హంసలక్ష్మి, వాంబే కాలనీ, రాజమహేంద్రవరం

పదింట ఒక్కరికే కందిపప్పు



బియ్యం, పంచదారతో పాటు ఇచ్చే కందిపప్పు అరకొరగా ఇస్తున్నారు. పది రేషన్ కార్డుదారుల్లో ఒక్కరికే కందిపప్పు ఇస్తున్నారు. ఒకవైపు బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.. ప్రభుత్వం అందరికీ కందిపప్పు ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– నాగులపల్లి ఆశ, బొమ్మూరు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైల్వే మెనూ 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతులు, ఆర్‌డీఎస్ఎస్ బ్రేకర్ రక్షన్ వర్క్స్ కోసం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రాజమండ్రిలోని ఆవ రోడ్, గారపాటినగర్, శాంతిపురం, రైల్వేస్టేషన్ వెనుక ప్రాంతం తదితర చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రాజమహేంద్రవరం సిటీ: సాంకేతిక మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం కలుగుతుందని చెప్పారు. శాటిలైట్ సిటీ ఏ, బీ, సీ, డీ బ్లాకులు, బుచ్చయ్య నగర్, పాములగుడి ఏరియా, సింగపూర్ సిటీ, పిడింగొయ్యి, హుకుంపేట పంచాయతీ పరిధిలోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఓల్డ్ బొమ్మూరు, మురళీకొండ, సోమనవారి తోట, జీపీఆర్ రోడ్, ఏఎంజీ కాలేజీ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అవరోధం కలుగుతుందన్నారు.

నర్సరీ రైతుల సమావేశం

కడియం: కడియపులంక అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు మంగళవారం సంఘ కార్యాలయంలో సమావేశమయ్యారు. నర్సరీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై, వ్యాపారావకాశాలు మెరుగుపడేందుకు కార్యాచరణ, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి తేవడం తదితర అంశాలపై చర్చించారు. సంఘ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

14న అంబేడ్కర్ జయంత్యుత్సవ ర్యాలీ



క్వారీ మార్కెట్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆస్క్ ప్రతినిధులు

పోస్టర్లు ఆవిష్కరించిన ఆస్క్ ప్రతినిధులు

సీటీఆర్ఐ: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ సేవా కేంద్రం(ఆస్క్) ఆధ్వర్యంలో జయంత్యుత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. మంగళవారం స్థానిక క్వారీ మార్కెట్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ర్యాలీకి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, అంబేడ్కర్ స్ఫూర్తి, సిద్ధాంతాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్న ఉద్దేశంతో అంబేడ్కర్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఆస్క్ ద్వారా ఐదేళ్లుగా అంబేడ్కర్ జయంత్యుత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 3 గంటలకు క్వారీ మార్కెట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం నుంచి గోకవరం బస్టాండ్ వద్దనున్న విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల ఆనవాళ్లు నిజమే..

సాక్షి ఇంపాక్ట్

కడియం: పొట్టిలంక శివార్లలోని గోదావరి లంకలో లంకమట్టి తవ్వకాలు జరిగినట్లు ఆనవాళ్లు ఉన్నాయని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు వినియోగించిన వాహనాలేవీ తమకు కన్పించలేదని చెప్పారు. వారికి కాసులు.. వీరికి కష్టాలు శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం వెలువడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ, సర్వేయర్, వీఆర్‌వోలతో కలిసి సంబంధిత భూములను పరిశీలించామన్నారు. భౌగోళిక పరిస్థితుల మేరకు అది తమ పరిధిలోనిది కాదని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రు లంక గ్రామం పరిధిలోకి ఆ భూములు వస్తాయన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు సునీల్‌కుమార్ చెప్పారు.

వేద విద్యార్థులను ప్రోత్సహించాలి

లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఐదేళ్ల ప్రాయంలోనే తల్లిదండ్రులను వదిలి, 12 ఏళ్ల పాటు వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్ అన్నారు. మంగళవారం కొంతమూరు గ్రామంలోని శ్రీదత్తాత్రేయ వేద విద్య గురుకులంలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ రాజమండ్రి రూరల్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన 60 పరుపులు, రెండు అల్మారాలు, అక్కడున్న గోవులకు రూ.10 వేల విలువైన పశుగ్రాసం అందజేశారు. క్లబ్ రాజమండ్రి రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రనాథ్, త్రినాథ్, కోశాధికారి మనోహర్ పర్యవేక్షణలో ఈశ్వర్‌కుమార్ చేతులమీదుగా గురుకులం ప్రతినిధులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, గత నెలలో గురుకులానికి వంద కుర్చీలు అందజేశామన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పర్యటన సందర్భంగా రూ.లక్ష విలువైన సామగ్రి సమకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఉడతా రంగారావు, రీజనల్ చైర్‌పర్సన్ ముదునూరు వాణిశ్రీ, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ రాహుల్, పారిశ్రామికవేత్త బీవీఎస్ రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



గురుకులానికి సామగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

జీజీహెచ్ విభాగాల్లో విస్తృత తనిఖీలు

కంబాలచెరువు: ఆస్పత్రి పనితీరును మెరుగుపర్చడంలో భాగంగా స్థానిక ప్రభుత్వ బోధనాస్పత్రిలో సూపరిండెంటెండ్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ మంగళవారం వివిధ విభాగాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆయా విభాగాల్లో డ్యూటీ డాక్టర్ల వివరాలు, వారి పనితీరు, పనివేళల్లో ఏం చేస్తున్నారనే విషయాలను పరిశీలించారు. ఆస్పత్రిలో పై అంతస్తులకు వెళ్లి, అక్కడ రోగులకు అందుతున్న వైద్యం, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో మాట్లాడి, రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పలు సూచనలు చేశారు. సమయానికి వైద్య సేవలందించి, రోగులను సేవాభావంతో చూడాలని చెప్పారు. అత్యుత్తమ ఆరోగ్య సేవలందించడమే తమ లక్ష్యమని, సిబ్బంది సమష్టిగా పని చేసి రోగులకు సంతృప్తి కలిగించాలన్నారు. జీజీహెచ్‌లో ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపర్చడానికి ముఖ్యమైన చర్యలు చేపట్టినట్లు డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ తెలిపారు.



జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

మానసిక ఆస్పత్రుల సందర్శన

క్షుణ్ణంగా పరిశీలించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి స్థానికంగా ఉన్న మానసిక ఆస్పత్రులను మంగళవారం సందర్శించారు. స్థానిక దానవాయిపేటలోని మానస, హరిత, విజయ, స్నేహ మానసిక చికిత్స ఆస్పత్రులతో పాటు, రాజానగరంలోని జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రిలోని మానసిక చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. ఆ విభాగంలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, అందుతున్న వైద్య సదుపాయాలు, ఇతర వివరాలను అక్కడి వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామన్నారు. మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న వారితోను, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆస్పత్రి అందిస్తున్న సదుపాయాలు, వైద్య సేవలను తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చన్నారు. ఆమె వెంట ఆయా ఆస్పత్రులకు చెందిన డాక్టర్ కర్రి రామారెడ్డి, కర్రి మానస, డాక్టర్ జి.సాయికృష్ణకుమార్, డాక్టర్ ఎంటీవీ పట్టాభిరామారావు, ప్రొఫెసర్ వీవీ జగదీష్ తదితరులు ఉన్నారు.



మానస ఆస్పత్రిని సందర్శిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ఎల్ఐసీ ఎస్‌డీఎం సంధ్యారాణి



చలివేంద్రాన్ని ప్రారంభించిన సంధ్యారాణి, ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎల్ఐసీ ఉద్యోగులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. మంగళవారం మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద డివిజనల్ ఆఫీసు, రూరల్ బ్రాంచి ఉద్యోగుల సహకారంతో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాథ్యూస్, ఎం.కోదండరామ్, మేనేజర్లు సత్యనారాయణ సాహు, రేఖ, ప్రసాద్, కృష్ణ, సూర్యనారాయణ, సుజాత, యూనియన్ నాయకులు పీఎస్ఎన్ రాజు, గన్నెయ్య, విశ్వనాథ్, బి.శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వస్తువుల సమర్పణ

సీతానగరం: కాటవరం గ్రామ దేవత పోశాలమ్మ అమ్మవారికి దాతలు వెండి వస్తువులను మంగళవారం సమర్పించారు. కాటవరానికి చెందిన దివంగత అల్లంరాజు వెంకటేశ్వరరావు కుమారులు, బంధువులు, మిత్రులు కలిసి రూ.1.30 లక్షల విలువైన వెండి పళ్లెం, శఠగోపం, పంచపాత్ర ఉద్ధరిణిని ఆలయ కమిటీ సభ్యులు చిట్టూరి రంగరావు, చిట్టూరి సూర్యచంద్రం, చాట్రగడ్డ సత్యనారాయణ, బొల్లి సుబ్రహ్మణ్యంకు అందించారు.



కమిటీ సభ్యులకు వెండి వస్తువులు అందిస్తున్న దాతలు

ఆశాజనకంగా రబీ పంట

సీపీవో జేడీ అప్పలకొండ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండ తెలిపారు. మండలంలోని రాజవోలు గ్రామంలో మంగళవారం క్షేత్ర స్థాయిలో పంటకోత ప్రయోగాన్ని ఆయన పరిశీలించారు. రాజవోలు వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగం చేయగా, 30.250 కిలోలు, బొమ్మూరు వ్యవసాయ క్షేత్రంలో 25.310 కిలోల దిగుబడి వచ్చినట్లు వివరించారు. బొమ్మూరులోని గిరిజన సంక్షేమ హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులను బోధన, భోజన సదుపాయాలపై తెలుసుకున్నారు. ఆయన వెంట ఉప గణాంకాధికారి జె.సూర్యనారాయణ, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.దుర్గబాబు, ఎం.హేమంత్ నాగసురేష్, ఎస్.రాహుల్ తదితరులు ఉన్నారు.



బొమ్మూరులో పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అప్పలకొండ

ఘనంగా వేణుగోపాలస్వామి తీర్థం

వేండ్రలో ఆధ్యాత్మిక సందడి

పెదపూడి: వేండ్ర గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామివారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలాహలంతో ఆలయం ప్రాంగణం ఉదయం నుంచి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. గ్రామ ప్రజలు వేకువనే స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అనంతరం నిర్వహించిన కోలాటం, ఆర్కెస్ట్రా, గొల్లభామ నృత్య కార్యక్రమాలు ఆద్యంతం భక్తులను అలరించాయి.

కన్నుల పండువగా రథోత్సవం

మధ్యాహ్నం 4 గంటలకు ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవానికి భక్తజనం పోటెత్తారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఉన్న రథాన్ని గ్రామ వీధుల వెంట ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా విచ్చేశారు. ఏటా శ్రీరామ నవమి తర్వాత వచ్చే ఏకాదశి రోజున రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కల్యాణం బుధవారం తెల్లవారుజామున ఐదు గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు

మట్టి పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగం

వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్

కోరుకొండ: మట్టి నమూనా పరీక్షల నివేదిక ఆధారంగా తగిన మోతాదులో ఎరువులు వాడాల్సి ఉంటుందని, తద్వారా పంట దిగుబడి పెరగడానికి దోహదపడుతుందని రాజమహేంద్రవరానికి చెందిన వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో వ్యవసాయ విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మట్టి నమూనా సేకరణ, వ్యవసాయ యాంత్రీకరణపై రైతులకు అవగాహన నిర్వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, భూసారాన్ని పరీక్షించడం ద్వారా మొక్కల ఎదుగుదలతో పాటు, దిగుబడి పెంపొందడానికి దోహదపడుతోందన్నారు. నేల స్వభావాన్ని రైతులు ముందుగానే గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి క్షేత్ర స్థాయిలో రైతుల సమక్షంలో మట్టి నమూనా సేకరణను విద్యార్థులతో నిర్వహించారు, ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్ యంత్రాల పనితీరును రైతులకు వివరించారు. కాలేజీ ప్రొఫెసర్లు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



శ్రీరంగపట్నంలో మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

ఐదుగురు జూదరుల అరెస్ట్

సీతానగరం: సింగవరం పంచాయతీలోని నాగరత్నం కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను మంగళవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.6,100 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరంతా అదే కాలనీకి చెందినవారని, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

CHANGE OF NAME

I, CHELLUBOINA LAKSHMI PRIYANKA (New Name), W/o. Vasamsetti Sainath, D/o. Chelluboina Babu Rao, previously called as VASAMSETTI LAKSHMI PRIYANKA (Old Name) resident of D.No.4-408, Navabharath Nagar, 5th Road, Bommuru, Rajamahendravaram Rural, E.G. Dist, A.P. Now changed my name from VASAMSETTI LAKSHMI PRIYANKA to CHELLUBOINA LAKSHMI PRIYANKA. Henceforth I will be called as CHELLUBOINA LAKSHMI PRIYANKA for all purposes.